


TE TL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:88 | 10-08-2026 సోమవారం | పేజీలు: 08 | వెల 3/-

# భాగ్యనగరం బోనమెత్తింది..

### సింహవాహిని అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి.. ప్రభుత్వ తరపున పట్టువస్త్రాల సమర్పణ

## లాల్‌దర్వాజాకు పోటెత్తిన భక్తజనం



- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- మంత్రులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖుల అమ్మవారి దర్శనం
- భక్తుల కోసం ఆరు క్యూలైన్లు.. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు
- ఐదు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం
- 2,500 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు

**హైదరాబాద్, ఆగస్టు 9,**

ఆషాఢ బోనాల పండుగతో భాగ్యనగరం భక్తి భావంతో మురిసిపోయింది. ఓల్డ్‌సిటీలోని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మ వారి ఆలయంతో పాటు నగరంలోని ప్రధాన దేవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవా రుజామున 4.30 గంటల నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ప్రారంభమయ్యా యి. ఆలయ నిర్వాహకుల తరపున అమ్మవారికి తొలిబోనం సమర్పించారు. బోనం, ఒడిబియ్యం, చీర, సారె సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

**అమ్మవారి సేవలో మంత్రులు**

లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆల యాన్ని బోనాల జాతర సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి శ్రీధర్‌బా బు అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ ప్రియాంక ఆలయానికి చేరుకుని అమ్మవారికి బంగారు బోనం సమర్పిం చారు. ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తుల బోనాలు, ఒడిబియ్యం,

మిగతా 2వ పేజీలో..






### లార్జెస్ట్ తైక్వాండో లెసన్ కు
## గిన్నిస్ వరల్డ్ రికార్డు!

- హైదరాబాద్ కేంద్రంగా జరిగిన కార్యక్రమం !
- అంతర్జాతీయ గుర్తింపు గడించిన ఎంజేఅర్ అకాడమీ !
- ఇప్పటికే 30 సార్లు వరల్డ్ రికార్డు !
- అలరించిన నైపుణ్య ప్రదర్శనలు!

**హైదరాబాద్ ఆగస్టు9, :**

తైక్వాండో లెసన్ కార్యక్రమానికి అంత ర్జాతీయ గుర్తింపు దక్కింది.ఆదివారం హైదరాబాద్ లోని గచ్చిబౌలి జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియం లో వందలాది విద్యార్థుల నైపుణ్య ప్రదర్శన అద్యంతం ఆకట్టుకుంది. 30 సార్లు ఇప్ప టికే వరల్డ్ రికార్డు సాధించిన మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ప్రతిని దులు డిజిటల్ లింక్ ద్వారా వీక్షించారు. 8 ఏళ్ళ నుండి 70 ఏళ్ళ వరకు ఉన్న క్రీ డాకారులు తమ ప్రదర్శనతో వీక్షకులను ఆకట్టుకున్నారు. 35 నిమిషాలపాటు

మిగతా 2వ పేజీలో..






## సీతక్క రాకతో కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ

- ఆదివాసీ సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేయాలి కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ముందుకు సాగాలి
- తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ ( సీతక్క)....

**అశ్వరావుపేట:ఆగస్టు 09(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు రింగ్ రోడ్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా కొమరం భీమ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు

మిగతా 4వ పేజీలో..

### ఆదివాసీ దినోత్సవ వేడుకలో ఆదివాసీ ప్రజా ప్రతినిధులకు
## అవమానం

- ఆదివాసీ దినోత్సవ వేదికపై ఎమ్మెల్యే, సర్పంచ్ ఫొటోలు మిస్సింగ్

7






## నాటి పోలీసు అమరుల త్యాగాలే నేటి శాంతికి నిదర్శనం

- వరంగల్‌లో అమరుల కుటుంబాలతో డీజీపీ సీ వీ ఆనంద్ భేటీ
- 'టీజీ-వీర్' యాప్ ప్రారంభం

2

### సైబర్ నేరాలే కొత్త సవాల్.. పోలీసింగ్‌లో
## అప్రమత్తత తప్పదు

- ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు సూచన

2

## మ్యాట్రిమోని పరిచయం.. రూ.45 లక్షల సైబర్ మోసం

- హైదరాబాద్‌కు చెందిన 39 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగికి టోకరా
- ముంబయికి చెందిన మహిళగా పరిచయం చేసుకున్న యువతి
- రూ.7,500తో మొదలై రూ.45 లక్షలకు చేరిన పెట్టుబడి
- లాభాల ఉపసంహరణకు 30 శాతం పన్ను చెల్లించాలని డిమాండ్
- మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తు

2






### స్వచ్ఛ ఇంధన హబ్‌గా
## తెలంగాణ

- యూసీ బర్క్లీలో భట్టి విక్రమార్క కీలక భేటీ
- భవిష్యత్ ఇంధన అవసరాలు, గ్రీన్ టెక్నాలజీపై విస్తృత చర్చ
- 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యంపై వ్యూహాలు
- గ్రిడ్ ఆధునీకరణ, బ్యాటరీ నిల్వ వ్యవస్థలపై పరిశోధకులతో చర్చ

2

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
సోమవారం
10-08-2026

# మ్యాట్రిమోని పరిచయం.. రూ.45 లక్షల సైబర్ మోసం

**హైదరాబాద్, ఆగస్టు 10, :**

పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న ఓ ప్రైవేటు ఉద్యోగికి ఆన్‌లైన్ పరిచయం భారీ ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది. వివాహం చేసుకుంటానంటూ పరిచయమైన ఓ మహిళ.. డ్రాప్‌షిప్పింగ్, పెట్టుబడుల్లో భారీ లాభాలు వస్తాయని నమ్మించి దశలవారీగా రూ.45 లక్షలు పెట్టుబడి పెట్టించింది. చివరకు నగదు తిరిగి తీసుకునే ప్రయత్నం చేయగా 30 శాతం పన్ను చెల్లించాలని చెప్పి, అనంతరం ఫోన్లు స్విచ్చాఫ్ చేసి అతడిని సంప్రదించకుండా తప్పించుకుంది.

**మ్యాట్రిమోని వేదికగా పరిచయం**

ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం హైదరాబాద్ హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన 39 ఏళ్ల ప్రైవేటు ఉద్యోగి వివాహం చేసుకునేందుకు పేరొందిన మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్‌ను నమోదు చేసుకున్నారు. ఈ ప్రొఫైల్‌ను చూసిన ముంబయికి చెందిన మహిళ ప్రీతి గుప్తా (28) పేరుతో ఫోన్ చేసి పరిచయం చేసుకుంది. అనంతరం వాట్సాప్‌కు చెందిన రెండు నంబర్లు, టెలిగ్రామ్‌కు మరో నంబర్ ఇచ్చి వాటి ద్వారా తరచూ మాట్లాడేది.

మూడు నెలలపాటు ఇద్దరి మధ్య వాట్సాప్ కాల్స్, వీడియో కాల్స్, చాటింగ్ కొనసాగింది. క్రమంగా ఆమెపై నమ్మకం పెరగడంతో తన ఆర్థిక వ్యవహారాల గురించి కూడా ఉద్యోగి ఆమె చెప్పిన మాటలను విశ్వసించినట్లు పోలీసులు తెలిపారు.

**రూ.7,500 నుంచి రూ.45 లక్షలకు**

భవిష్యత్ కోసం తాను నిర్వహిస్తున్న డ్రాప్‌షిప్పింగ్, పెట్టుబడి వ్యాపారంలో నగదు పెడితే అధిక లాభాలు పొందవచ్చని మహిళ అతడిని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలుత రూ.7,500 పెట్టుబడితో ప్రారంభించిన ఉద్యోగి.. ఆమె సూచనల మేరకు దశలవారీగా సుమారు రూ.45 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు.

డ్రాప్‌షిప్పింగ్ యాప్‌లో తనకు కేటాయించిన ఖాతాలో లాభాలు వచ్చినట్లు కనిపించడంతో అతడి నమ్మకం మరింత పెరిగింది. అయితే ఆ మొత్తాన్ని ఉపసంహరించుకునే ప్రయత్నం చేయగా 30 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందని మహిళ చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

**ఫోన్లు స్విచ్చాఫ్.. బ్లాక్**

పన్ను చెల్లింపు తదితర కారణాలతో ఉద్యోగిని మరింతగా డబ్బు చెల్లించేలా ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం మహిళ తన ఫోన్లన్నింటినీ స్విచ్చాఫ్ చేసింది. మరో ఫోన్ నంబర్ ద్వారా ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆ నంబర్‌ను కూడా బ్లాక్ చేసినట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు.

దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన ప్రైవేటు ఉద్యోగి మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. మహిళ ఉపయోగించిన ఫోన్ నంబర్లు, పెట్టుబడుల లావాదేవీలు, డిజిటల్ ఖాతాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ.. రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

**నల్లబెల్లి, :**

తెలంగాణ ఉద్యమ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. ఆదివారం నల్లబెల్లిలోని పెద్ది స్వగృహానికి వెళ్లిన కేసీఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ముందుగా పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఆయన.. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో కంటతడి పెట్టుకున్నారు. పెద్ది మరణం పార్టీకి, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

**పిల్లల భవిష్యత్‌కు రూ.2 కోట్లు**

పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ తరఫున రూ.2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆయన ఇద్దరు పిల్లల పేర్లపై చెరో రూ.1 కోటి చొప్పున మొత్తం రూ.2 కోట్లు కేటాయించారు. పెద్ది తల్లి అమృతమ్మ సంక్షేమం కోసం రూ.25 లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

పిల్లల చదువు, భవిష్యత్ అవసరాలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ అన్ని విధాలా సహకరిస్తుందని కేసీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఆర్థిక సాయం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**మరిన్ని సహాయక చర్యలపై నిర్ణయం**

పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ పూర్తయిన అనంతరం జిల్లా పార్టీ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కుటుంబానికి అవసరమైన ఇతర సహాయ కార్యక్రమాలను కూడా ఆ సమావేశంలో ఖరారు చేయనున్నట్లు తెలిపాయి. భవిష్యత్‌లోనూ పెద్ది కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నాయి.

**కేసీఆర్‌కు ఘన స్వాగతం**

కేసీఆర్ నల్లబెల్లి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికాయి. మార్గమధ్యంలో పలుచోట్ల కాన్వాయ్‌ను ఆపిన కేసీఆర్ కార్యకర్తలను పలకరించి వారితో మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో నల్లబెల్లి పరిసరాలు మార్మోగాయి.

# స్వచ్ఛ ఇంధన హబ్‌గా తెలంగాణ

**కాలిఫోర్నియా, :**

తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగంలో ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలో పనిచేస్తున్న ‘ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్’ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధకులు, నిపుణులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో భారత పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, తెలంగాణ భవిష్యత్ ఇంధన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు.

**500 గిగావాట్ల లక్ష్యంపై వ్యూహాలు**

2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ ఇంధన సామర్థ్యాన్ని సాధించేందుకు అవసరమైన కార్యాచరణపై సమావేశంలో చర్చ జరిగింది. శుద్ధ ఇంధన సాంకేతికతల వ్యయం తగ్గుతున్న నేపథ్యంలో ఏర్పడుతున్న కొత్త అవకాశాలను పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల అనుసంధానం, సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో సోలార్ నమూనా**

తెలంగాణలో అమలు చేస్తున్న పునరుత్పాదక ఇంధన విధానాలను భట్టి విక్రమార్క వివరించారు. పారదర్శకమైన హరిత విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తూ సౌరశక్తితో పాటు ఇతర పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న విధానాన్ని వివరించారు. పీఎంకుసుమ్ పథకం ద్వారా రైతులకు స్వచ్ఛ ఇంధనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజాకేంద్రిత విధానాలపై అంతర్జాతీయ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు.

**క్లీన్‌టెక్ తయారీకి ప్రోత్సాహం**

రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్‌టెక్ పరికరాల తయారీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా ఇంధన రంగంలో అనుసరిస్తున్న విధానాలను తెలంగాణ అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడంపై చర్చించారు.

**యూసీ బర్క్లీతో సంయుక్త అధ్యయనాలు**

విద్యుత్, రవాణా, పారిశ్రామిక రంగాలతో పాటు వాతావరణ స్థిరత్వంపై తెలంగాణ, యూసీ బర్క్లీ కలిసి అధ్యయనాలు చేపట్టే అంశాన్ని సమావేశంలో ప్రస్తావించారు. విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత పెంచేందుకు సహకారం అందించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా సరికొత్త విధానాలను రూపొందించేందుకు అంతర్జాతీయ అనుభవాలను వినియోగించుకోవాలని భేటీలో నిర్ణయించారు.

# నాటి పోలీసు అమరుల త్యాగాలే నేటి శాంతికి నిదర్శనం

**హైదరాబాద్**

పోలీసు అమరుల త్యాగాల ఫలితంగానే నేడు రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధి నిర్వహణలో నక్సలైట్లతో పోరాడుతూ అమరులైన 28 మంది పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో ఆయన ఆత్మీయంగా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా అమరుల కుటుంబాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ‘టీజీవీర్’ గ్రీవెన్స్ పోర్టల్‌ను డీజీపీ ప్రారంభించారు. ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, కారుణ్య నియామకాలు, స్థలాల కేటాయింపు, సంక్షేమ పథకాల వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదికపై నమోదు చేసుకునేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. అమరుల సేవా వివరాలు, కుటుంబ సమాచారం, ఇప్పటివరకు పొందిన ప్రయోజనాలు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు కూడా ఇందులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. రాష్ట్ర, యూనిట్ స్థాయిలో అధికారులు ఫిర్యాదుల పరిష్కారాన్ని పర్యవేక్షించే అవకాశం కల్పించారు. అమరుల కుటుంబాలకు క్యూ ఆర్ కోడ్‌తో కూడిన ప్రత్యేక ఫ్యామిలీ కార్డులను డీజీపీ అందజేశారు. ఆ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే నేరుగా టీజీవీర్ పోర్టల్‌కు చేరుకునేలా ఏర్పాటు చేశారు. ఈ పోర్టల్‌ను రూపొందించిన ఎస్ఐబీ అధికారులను అభినందించిన ఆయన, రాష్ట్రంలోని అన్ని యూనిట్ల నుంచి అమరుల కుటుంబాల సమస్యలను సేకరించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

సమావేశంలో అమరుల కుటుంబాలు ఎక్స్‌గ్రేషియా, ఆర్థిక సాయం, స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్, పెన్షన్, ఇతర సంక్షేమ అంశాలకు సంబంధించిన ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను డీజీపీ దృష్టికి తీసుకొచ్చాయి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అలాగే వాటి పరిష్కారాన్ని వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని వరంగల్ పోలీసు కమిషనర్‌కు సూచించారు. తన ఉద్యోగ జీవితాన్ని వరంగల్‌లోనే ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేసుకున్న డీజీపీ, నక్సలైట్ల ప్రభావం తీవ్రంగా ఉన్న రోజుల్లో పోలీసు సిబ్బంది ఎన్నో ప్రాణత్యాగాలు చేశారని చెప్పారు. అప్పటి త్యాగాల వల్లే నేడు ఈ ప్రాంతంలో శాంతియుత వాతావరణం నెలకొన్నదని పేర్కొన్నారు. అనంతరం డీజీపీ నిర్మాణంలో ఉన్న వరంగల్ పోలీసు కమిషనరేట్ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పురోగతిని కమిషనర్ వివరించారు. ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందేలా, ఆధునిక సాంకేతికత, నిఘా వ్యవస్థలకు అనుకూలంగా భవనాన్ని తీర్చిదిద్దాలని డీజీపీ సూచించారు. వినియోగంలో లేని పాత భవనాలను తొలగించి, కార్యాలయానికి వెళ్లే అంతర్గత రహదారులను మెరుగుపరచాలని ఆదేశించారు






# సైబర్ నేరాలే కొత్త సవాల్.. పోలీసింగ్‌లో అప్రమత్తత తప్పదు

- **నక్సలిజం నుంచి సైబర్ నేరాల దిశగా మారిన సవాళ్లు.. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌పై డీజీపీ సమీక్ష**
- **ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలని అధికారులకు సూచన**
- **ఏడాదిలో సైబర్ మోసాలతో రూ.1,700 కోట్ల నష్టం**
- **చిన్నారులను టార్గెట్ చేస్తున్న డ్రగ్స్ ముఠాలపై కఠిన చర్యలు**
- **3,758 పోస్టుల్లో 782 ఖాళీలు.. కమిషనరేట్‌లో 50 స్టేషన్లు**
- **సాంకేతికతతోపాటు మౌలిక పోలీసింగ్‌కు ప్రాధాన్యం**

**వరంగల్, ఆగస్టు 9, :**

ఒకప్పుడు నక్సలిజం పోలీసులకు అతిపెద్ద సవాల్‌గా ఉండగా, ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వ్యాప్తి, ఆర్థిక మోసాలు, రోడ్డు భద్రత ప్రధాన సవాళ్లుగా మారాయని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరును సమీక్షించిన ఆయన.. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్నప్పటికీ ప్రాథమిక పోలీసింగ్ విధానాలను విస్మరించరాదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు తక్షణ స్పందన, ఫిర్యాదుల సకాల పరిష్కారమే పోలీసుల ప్రాథమిక బాధ్యతగా పేర్కొన్నారు.

**సాంకేతికతకు అనుగుణంగా దర్యాప్తు**

ఎన్ఐటీలో జరిగిన సమీక్ష సమావేశంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీస్పార్క్, సీఐడీ అధికారులు సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు పద్ధతులు, అందుబాటులోకి వచ్చిన సాంకేతిక వ్యవస్థలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించుకుంటూనే క్షేత్రస్థాయిలో పోలీసింగ్ బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు.

తన పోలీసు ప్రస్థానానికి వరంగల్‌తో విడదీయరాని అనుబంధం ఉందని సి.వి. ఆనంద్ గుర్తుచేసుకున్నారు. జిల్లాలో శిక్షణతో తన పోలీసు సేవలు ప్రారంభమయ్యాయని, అనంతరం వరంగల్ రూరల్ ఎస్పీగా పనిచేసిన కాలం తనకు ప్రత్యేకమైనదని తెలిపారు. నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో ల్యాండ్‌మైన్ పేలుళ్లు, దాడుల మధ్య పోలీసులు విధులు నిర్వర్తించారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితి పోలీసు అమరుల త్యాగాల ఫలితమని పేర్కొన్నారు.

**రూ.1,700 కోట్ల సైబర్ మోసాలు**

గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు సుమారు రూ.1,700 కోట్లు నష్టపోయారని డీజీపీ వెల్లడించారు. మోసానికి గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ముఖ్యంగా అధిక లాభాల ఆశ చూపుతూ జరిగే పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాల నియంత్రణ, దర్యాప్తులో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో నిలవడం గర్వకారణమని డీజీపీ పేర్కొన్నారు. సైబర్ నేరాల స్వభావం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసులు కూడా అదే స్థాయిలో తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

**చిన్నారులపై డ్రగ్స్ ముప్పు**

చిన్నారులను ఆకర్షించేందుకు చాక్లెట్ల రూపంలో మాదకద్రవ్యాలను చేరవేసే ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయని డీజీపీ అన్నారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రగ్స్ నియంత్రణ ఒక్క పోలీసు శాఖతో సాధ్యం కాదని, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

**అంతర్రాష్ట్ర ముఠాలపై నిఘా**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 50 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని కమిషనర్ సమీక్ష సందర్భంగా వెల్లడించారు. మొత్తం 3,758 మంజూరైన పోస్టులకు గాను 782 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బీహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చి చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని వివరించారు.

ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు చేపట్టిన ‘నేను సైతం’ కార్యక్రమాన్ని డీజీపీ అభినందించారు. ప్రజల సహకారాన్ని మరింత విస్తృతం చేసుకుని సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం, సమర్థవంతమైన మౌలిక పోలీసింగ్‌ను సమన్వయం చేస్తే ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయవచ్చని సూచించారు.

# లార్జెస్ట్ తైక్వాండో లెసన్ కు గిన్నిస్ వరల్డ్ రికార్డు!

**మొదటిపేజీ తరువాయి**

ఏకధాటిగా సాగిన ప్రదర్శన లో రకరకాల విన్యాసాలు ప్రదర్శించారు. ఒకే సమయంలో క్రమ పద్ధతిలో క్రీడాకారులు చేసిన కార్యక్రమాన్ని డిజిటల్ లింక్ ద్వారా వీక్షించిన గిన్నిస్ బుక్ ప్రతినిదులు నిర్వహకులను అభినందించారు.

**ఆన్లైన్ లోనే గిన్నిస్ రికార్డు ప్రకటన !**

విద్యార్థుల ప్రతిభా పాటవాలకు ముగ్దులైన గిన్నిస్ బుక్ ప్రతినిధులు లైవ్ టెలికాస్ట్ ద్వారా గిన్నిస్ రికార్డు పూర్తయినట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి స్వప్నిల్ నిబంధనల ప్రకారం కార్యక్రమం పూర్తయినందున గిన్నిస్ బుక్ లో రికార్డు ఐనట్టు ప్రకటించారు. వెంటనే వందలాది మంది క్రీడాకారులు, వారి కుటింబీకులు హర్షద్వానాలు తెలియజేసారు.

**చిన్నారుల ప్రతిభను కొనియాడిన మాస్టర్స్!**

30 ఏళ్లుగా తాను గిన్నిస్ రికార్డు కార్యక్రమాలు చేస్తున్నానని హైదరాబాద్ కేంద్రంగా జరిగిన



కార్యక్రమం తనను విశేషంగా ఆకట్టుకొందని గ్రాండ్ మాస్టర్ ఏం జయంత్ రెడ్డి తెలిపారు. ఇదే ప్రతిభను కొనసాగిస్తూ మరిన్ని రికార్డులు సాధించాలని క్రీడాకారులను కోరారు.ఎంతో శ్రమకూర్చి కార్యక్రమాన్ని నిర్వహించిన. మాస్టర్ గజేందర్ కుమార్,శ్రీకాంత్, సమన్వయ కర్త సుమన్, సారంగీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాజా ఆఫ్రిది ని అభినందించారు.

**ఆనందంలో కేరింతలు కొట్టిన క్రీడాకారులు**

గత కొన్ని రోజులుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం శ్రమిస్తున్న 530మంది క్రీడాకారులకృషికి ఫలితం దక్కడంతో వారంతా స్టేడియం లో కేరింతలు కొట్టారు. ఆన్లైన్ లో గిన్నిస్ బుక్ లో రికార్డు ఐనట్టు నిర్వాహకులు ప్రకటించంగానే ఆనందంతో క్రీడాకారులు ఉత్సహంగా గెంతులేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా మాస్టర్ పర్యవేక్షణ**

క్రీడాకారులను ఉత్సహపరుస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మాస్టర్ గజేంద్ర కుమార్ పర్యవేక్షణ అందరిని ఆకట్టుకుంది. స్టేడియం మొత్తం కలియ తిరుగుతు ఎప్పటికప్పుడు విన్యాసాలను క్రీడాకారులు మరింత ఉత్సాహంగా చేసేలా అయన ఉత్తేజ పరిచారు.కార్యక్రమం లో జరిగిన పలు రకాల విన్యాసాలలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో అయన సైతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# భాగ్యనగరం బోనమెత్తింది..

**మొదటిపేజీ తరువాయి**

చీర, సారె సమర్పణలు కొనసాగనున్నాయి. సాయంత్రం అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

**ప్రముఖుల సందడి**

లాల్‌దర్వాజా అమ్మవారిని పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ యాదవ్, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, గాయని మంగ్లీ తదితరులు అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించారు.

సినీ నటుడు విజయ్ దేవరకొండ తొలిసారిగా అమ్మవారిని దర్శించుకున్నట్టు తెలిపారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రొడక్షన్స్ హౌస్‌కు భద్రకాళి అనే పేరు పెట్టుకున్నారని, ఆయనతో పాటు ఆనంద్‌తో కలిసి ఆలయానికి వచ్చినట్టు చెప్పారు. తనతో పాటు అందరి కోరికలు నెరవేరాలని అమ్మవారిని ప్రార్థించినట్టు పేర్కొంటూ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు.

**భక్తులకు సౌకర్యాల కల్పన**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బోనం తీసుకొచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. వీఐపీలు, సాధారణ భక్తులకు దర్శనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్స్‌లు, వైద్య శిబిరాలు అందుబాటులో ఉంచారు. జోగినీలు ముందస్తుగా సమాచారం ఇస్తే వారికి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేశారు.

సోమవారం రంగం భవిష్యవాణి, పోతురాజుల విన్యాసాలు, భవానీ రథయాత్ర నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి బోనం సమర్పించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు కేటాయించినట్టు చెప్పారు. జోగినీలు నేరుగా బోనం తీసుకువెళ్లి అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని, వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

**ఐదు లక్షల మంది రాకపై అంచనా**

ఆషాఢమాసంలో ప్రతి ఏడాది జరిగే బోనాల జాతరకు సింహవాహిని



అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈసారి దాదాపు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా 8 దేవాలయాలతో పాటు లాల్‌దర్వాజా పరిధిలోని సుమారు మూడు వేల చిన్న దేవాలయాల్లోనూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. భారీ రద్దీ నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆలయ పరిసరాలు, రద్దీ ప్రాంతాలను 100 సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. భక్తుల భద్రత కోసం 2,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా కొనసాగేందుకు అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## తాడ్వాయి మండల కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనల మేరకు



**తాడ్వాయి డిడి9 వార్త**

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా కొమరం భీం విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించిన ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి తేదీ:09.08.2026 ఆదివారం తాడ్వాయి మండల కేంద్రంలో తుడం దెబ్బ మండల అధ్యక్షులు మోకాళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి , తాడ్వాయి మాజీ సర్పంచ్ , మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య సునీల్ దొర , తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నర్సింహా స్వామి కొమరం భీమ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మాట్లాడుతూ కొమరం భీం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని మన హక్కుల గురించి తెలుసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో సమ్మక్క పూజారులు సిద్దబోయిన స్వామి , సురేందర్ , మండల సర్పంచ్ లు పీరీల భారతి వెంకన్న , గడ్డం నాగభూషణం , కొరగట్ల సృజన- వెంకన్న , మొగిలిపల్లి రవీందర్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మంకిడి ప్రశాంత్ , ఇర్ప వెంకటేష్ , యాప కళ మోహనరావు , వట్టం తిరుపతి , బడే రజిత రాంబాబు , మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముక్తి రామస్వామి , తుడుందెబ్బ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాయం కోటి , విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి , గ్రామ కమిటీ అధ్యక్షులు బంగారు అజయ్ , మహేష్ , ఉదయ్ , బాలాజీ , తదితరులు పాల్గొన్నారు.

## కాల్వపల్లి గ్రామంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- గ్రామ సర్పంచ్ అధ్యక్షన కోరగట్ల సృజన వెంకన్న ఆధ్వర్యంలో బిర్సా ముండా, కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో "జల్.. జంగల్.. జమీన్" నినాదాలు

**తాడ్వాయి డిడి9 వార్త**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని G.O .NO.3 ను వెంటనే అమలు చేయాలని 1/70 చట్టాన్ని వెంటనే అమలు చేయాలని షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ హక్కుల కాపాడుకోవాలి రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో నిబంధనలు అమలు చేయాలని రాజ్యాంగంలో 342 నిబంధన ప్రకారం ఆర్టికల్ 19 (ఇ) ఏజెన్సీ సర్టిఫికెట్స్ ఇవ్వాలి అన్ని రెవిన్యూ అధికారులు వెంటనే ఇవ్వాలి పురస్కరించుకొని తాడ్వాయి మండలంలో కాల్వపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా, కొమరం భీమ్ ఆశయాలను స్మరించుకున్నారు. "జల్.. జంగల్.. జమీన్" నినాదాలతో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్–అడవి–భూమిపై హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సమాజ అభ్యున్నతికి యువత ఐక్యంగా ముందుకు సాగాలని, ఆదివాసీ నాయకులు పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలని ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి ఆశ్రమ పాఠశాల ప్రినిపాల్ ఈసం నర్సయ్య ఉప సర్పంచ్ సిద్ధ బోయిన కార్తిక్ ఆదివాసీ సేన ములుగు జిల్లా కన్వీనర్ ఆలం శ్రీను తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షడు కొప్పుల జగన్ కుడుముల రంజిత్ సగలం లవకుమార్ విగ్రహ ప్రతిష్టాత్మక కమిటీ అధ్యక్షుడు కొప్పుల శ్యామ్ కుడుముల రాజు వార్డు మెంబర్ లు కోరగట్ల సాయికిరణ్ సిద్ధబోయిన సాయికిరణ్ కొప్పుల కార్తిక్ కళ్యాణి కళా బృందం మధు గ్రామ పెద్దలు బడే సతీష్ కుడుముల రమేష్ కొప్పుల కృష్ణారావు సిద్ధబోయిన శ్రీనివాస్ వెంకయ్య మహిళా సంఘాలు కొప్పుల లక్ష్మీ సిద్ధ బోయిన సారాలక్ష్మి నీలమ్మ సుజాత శంకరమ్మ లు తదితరులు పాల్గొన్నవారు.

## బొగత జలపాతానికి పోటెత్తిన పర్యాటకులు

జలకళను సంతరించుకున్న బొగత.. సందర్శకులతో సందడిగా మారిన పర్యాటక ప్రాంతం



**వాజేడు, ఆగష్టు 10 (డీడీ9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం బొగత జలపాతం సందర్శకులతో సందడిగా మారింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జలపాతం జలకళను సంతరించుకోవడంతో ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జలపాతం వద్ద ఉరకలెత్తుతున్న నీటి ప్రవాహాన్ని చూసి పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన సందర్శకులు జలపాతం అందాలను వీక్షిస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు. బొగత జలపాతం పరిసర ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతుండటంతో పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. జలపాతం వద్ద పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలంలో బొగత జలపాతం మరింత ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున సందర్శకులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

# పోడు సాగుదారుల హక్కుల కోసం సమరశంఖం

- సాగుదారులపై దాడులు, దౌర్జన్యాలను ప్రతిఘటించాలి
- ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకుంటాం
- గుండాల ప్రాంతంలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయాలి
- గ్రామీణ ప్రాంతాలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలం
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను సమిష్టిగా అడ్డుకుందాం
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా



**ఆగస్టు 09 గుండాల (డి డి 9 వార్త).**

ఏజెన్సీ ప్రాంతమైన గుండాల మండలంలో ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ, హక్కుల కోసం ప్రజలను ఐక్యం చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర నాలుగో రోజు ఆదివారం జోరుగా కొనసాగింది. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న ఈ యాత్రకు గుండాల మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, రైతులు, పోడు సాగుదారులు, కార్మికులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకు వచ్చారు. సీపీఐ గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్కే షాహిద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ప్రజా చైతన్య ప్రచార జాత రథ సారథి కా. ఎస్కే సాబీర్ పాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గుండాల మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంత స్వరూపాన్ని కలిగి ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలు అనేక సంవత్సరాలుగా కనీస మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. పోడు సాగును నమ్ముకుని జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదల సమస్యలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పోడు సాగుదారులకు వెంటనే హక్కులు కల్పించాలి**

దశాబ్దాలుగా అడవిని, భూమిని నమ్ముకుని జీవిస్తున్న పోడు సాగుదారులకు వారు సాగు చేసుకుంటున్న భూములపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని ఎస్కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న పేదల భూముల విషయంలో అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. సాగు దారులపై దాడులు చేయడం, కేసులు పెట్టడం, భూముల నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన ప్రతి పోడు సాగు దారుడికి హక్కు పత్రాలు అందించాలని కోరారు. భూమి హక్కు లేకుండా పేద కుటుంబాలు అభద్రతలో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. "పోడు సాగుదారులపై జరిగే దాడులు, దౌర్జన్యాలను ఇక సహించేది లేదు. ప్రజలను సమీకరించి చట్టబద్ధమైన హక్కుల సాధన కోసం పోరాటం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

**ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచొద్దు**

గ్రామీణ పేదలకు అత్యంత ముఖ్యమైన ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాల్సింది పోయి దానిని దశలవారీగా నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. ఉపాధి కోసం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా గ్రామాల్లోనే పనులు లభించేలా ఈ పథకాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పథకానికి తగినన్ని నిధులు కేటాయించాలని, పనిదినాలు పెంచాలని, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా కార్మికులు, రైతులు, గ్రామీణ పేదలతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

**గుండాల గ్రామీణ ప్రాంతాలకు మౌలిక వసతులు ఎక్కడ?**

ఏళ్లు గడుస్తున్నా గుండాల ఏజెన్సీ ప్రాంతంలోని అనేక గ్రామాలు కనీస మౌలిక వసతులకు దూరంగానే ఉన్నాయని సాబీర్ పాషా అన్నారు. మారుమూల గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజల కష్టాలు మరింత పెరుగుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు చేరుకోవడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారి, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు.

**ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి**

దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కేవలం ప్రభుత్వ ఆస్తులు మాత్రమే కాదని, అవి దేశ ప్రజల సంపద అని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గడంతో పాటు సామాన్య ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, యువత, ప్రజా సంఘాలు ఐక్యంగా నిలబడి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**గుండాల ప్రాంతంలో నూతన భూగర్భ గనులు ఏర్పాటు చేయాలి**

గుండాల ప్రాంతంలో అందుబాటులో ఉన్న సహజ వనరులను స్థానిక ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని సాబీర్ పాషా కోరారు. ప్రాంతంలో నూతన భూగర్భ గనులను ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గనుల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంత అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను కూడా మెరుగుపరచాలని అన్నారు. స్థానిక ప్రజల హక్కులు, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమాలు**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సాబీర్ పాషా విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశ సంపదను కొంతమంది కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. "బద్లావ్ జరూరీ హై" నినాదంతో సీపీఐ ప్రజా చైతన్య యాత్రలను నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజలను ఉద్యమాలకు సిద్ధం చేయడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు.

**సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న చేపట్టనున్న "చలో ఢిల్లీ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారు. పోడు సాగుదారుల హక్కులు, ఉపాధి హామీ పథకం పరిరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ, కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరిస్తామని తెలిపారు.

**కొమరం భీమ్, అంబేద్కర్ విగ్రహాలకు ఘన నివాళులు**

ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొమరం భీమ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివాసీల హక్కులు, జల్–జంగల్–జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని నాయకులు స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆచరణలోకి రావాలని నాయకులు అన్నారు. గిరిజనుల భూమి, ఉపాధి, విద్య, వైద్యం, మౌలిక వసతులు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**

ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సీపీఐ కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ పాల్గొన్నారు. అలాగే బచ్చల రామయ్య, లక్ష్మయ్య, సాహెబ్, సమ్మయ్య, సమీర్, సంధ్యారాణి, నాగమణి, ఎర్రమ్మ, అప్రోచ్, నాసిర్, షబ్బీర్, పవన్ కళ్యాణ్, రవి వర్మ, వంశీ, వరుణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజల హక్కుల కోసం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం, పోడు సాగుదారుల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి గ్రామం నుంచి ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మంగపేట లో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

ఆదివాసి ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో

**మంగపేట ఆగస్టు09డీడీ9 వార్త**

మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఆదివాసి ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మంగపేట మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామాలకు చెందిన ఆదివాసి నాయకులు ఆయా గ్రామాలలో జెండా ఎగురవేసి ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆదివాసి గ్రామ పెద్దలు, ఆదివాసి సంఘాలు, మహిళా సంఘాలు, ఉద్యోగ సంఘాలు , ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలకు చెందిన నాయకులు, ఆదివాసి ప్రజలు మండలంలోని బోరు నర్సాపురంకు చేరుకుని అక్కడ నుండి మండల కేంద్రంలోని కొమరం భీం విగ్రహం వరకు ఆదివాసి సాంప్రదాయ నృత్యాలతో, జై ఆదివాసీ జై జై ఆదివాసీ అంటూ నినాదాలిచ్చుకుంటూ భారీ ర్యాలీ





నిర్వహించారు. మంగపేటలో అంబేద్కర్ విగ్రహానికి, కొమరం భీమ్ విగ్రహానికి ఆదివాసి సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసి జెండా ఎగురవేశారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాలకు చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ఎందరో మహనీయులు త్యాగాలు చేశారన్నారు. ఆదివాసీ వర్గాల సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గొప్ప వీరయ్య, గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణ ప్రసాద్, కొండా చెంచయ్య, కబ్బాక శ్రావణ్, నల్లబోయిన లక్ష్మణ్ దొర, అయ్యోరి యానయ్య, మద్దెల అంజయ్య, తాటి నాగరాజు, , జబ్బ రవి, పొదెం రవీందర్, ఎట్టి సారయ్య, బాడిశ నాగ రమేష్, పొదెం మేనక, డబ్బుల ముత్యాల రావు, రూప భద్రయ్యచాద మల్లయ్య, తల్లడి నాగేశ్వర రావు, సోయం ఈశ్వర్, తోలేం రామకృష్ణ,కొంచెం మొగిలి, తోలెం నరసింహారావు , కోరెం శ్రీను, పూనెం రాములు, కొమరం రవి, పూనెం ప్రశాంత్, కుర్సం రమేష్, పొదెం నాగేష్,ఆక తిరుమలరావు, కొమరం లక్ష్మీపతి, కబ్బాక లక్ష్మణ్, కొమరం సారన్న, కొమరం బాలన్న,ఇరప అరుణ, తోలేం సౌమ్య, వాగబోయిన లావణ్య,పుసాం సావిత్రి, ఇరప రజిని, కొమరం లక్ష్మీపతి, మద్దెల నాగేశ్వరరావు, కొమరం రవి, జోగ నరేందర్, ముక్తి రవి, వివిధ పార్టీలకు చెందిన మైల జయరాం రెడ్డి, చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, ఎల్పీ.ముత్యాలు, పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ళ సురేష్ , మురుకుట్ల నరేందర్, ఎంపెల్లి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీతక్క రాకతో కొమరం భీమ్ విగ్రహ ఆవిష్కరణ





- **ఆదివాసులతో ఆకుపచ్చమయమైన అశ్వరావుపేట**
- **ఆదివాసీ సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేయాలి కొమరం భీమ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ముందుకు సాగాలి**
- **తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ ( సీతక్క)....**

**అశ్వరావుపేట:ఆగస్టు 09(డిడి 9 వార్త)**

అశ్వారావుపేట ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు రింగ్ రోడ్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క) చేతుల మీదుగా కొమరం భీమ్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు

జిల్లా కలెక్టర్ అంకిత్ స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు పాల్గొనగా ఈ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి ప్రత్యేకమైన జీవన విధానం సంస్కృతి సంప్రదాయాలు దేశానికి గొప్ప వారసత్వమని పేర్కొన్నారు అడవిని తల్లిగా భావించి ప్రకృతితో మమేకమై జీవించే ఆదివాసీల జీవన విధానం ఎంతో విశిష్టమైనదని అన్నారు అడవులు కొండలు వాగులు వనరులను కాపాడటంలో ఆదివాసీల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు ప్రకృతిని కాపాడుతూ తమ సంస్కృతిని తరతరాలకు అందిస్తున్న ఆదివాసీ సమాజాన్ని అభినందించారు ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కొమరం భీమ్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు జల్ జంగల్ జమీన్ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు ప్రతి కుటుంబం తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని కోరారు ఉన్నత విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధిపై యువత దృష్టి పెట్టాలని సూచించారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ విద్యా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఆదివాసీ యువత పోటీ పరీక్షలకు సిద్ధమై ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు మహిళలు విద్య ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ఆదివాసీ మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడాలని సూచించారు ఆరోగ్యంపై ప్రతి కుటుంబం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు పిల్లలకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చని అన్నారు తమకు ఉన్న హక్కులు ప్రభుత్వ పథకాల గురించి ప్రతి కుటుంబం తెలుసుకోవాలని సూచించారు భూమి అటవీ హక్కులు ఉపాధి విద్య ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు ఆదివాసీ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని పేర్కొన్నారు రోడ్లు తాగునీరు విద్యుత్ విద్య వైద్యం వంటి సౌకర్యాలు ప్రతి గ్రామానికి అందేలా ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలని పేర్కొన్నారు అభివృద్ధి పేరుతో ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు ఆదివాసీ భాషలు కళలు నృత్యాలు జానపద సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు తమ సంస్కృతిని గౌరవించడంతో పాటు ఆధునిక సమాజంతో పోటీపడేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు ప్రకృతి సంపదను కాపాడుతూ జీవనోపాధిని మెరుగుపరుచుకునే మార్గాలను అన్వేషించాలని తెలిపారు అటవీ ఉత్పత్తులకు వినియోగించుకుంటూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీ సమాజం తమ హక్కుల కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చైతన్యం, విద్య, ఐక్యతతోనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు ప్రతి ఆదివాసీ కుటుంబం ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా బలోపేతం కావాలన్నారు ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు అధికారులు కలిసి పనిచేస్తారని తెలిపారు ఆదివాసీ దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకుండా అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలని అన్నారు ప్రతి ఆదివాసీ కుటుంబంలో విద్య తో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధనిక అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు కొమరం భీమ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు ఆదివాసీ సమాజం ఐక్యతతో ముందుకు సాగి అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని ప్రముఖులు ఆకాంక్షించారు ఈ కార్యక్రమం ఆదివాసీ ప్రజల్లో చైతన్యం నింపడంతో పాటు విద్య ఆరోగ్యం ఉపాధి హక్కులపై కొత్త ఆలోచనలకు నాంది పలికింది...

# ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- **కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు.**
- **ఆదివాసీ హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా ముందుకు సాగాలి ఎమ్మెల్యే పాయం.**

**మణుగూరు.ఆగస్టు 9(డి డి 9వార్త)**



ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు మండలంలో నిర్వహించిన వేడుకల్లో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మణుగూరులోని హనుమాన్ టెంపుల్, అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కొమురం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆదివాసీ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధుడు కొమురం భీమ్ అని అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, "జల్, జంగల్, జమీన్" నినాదంతో కొమురం భీమ్ చేసిన పోరాటం దేశంలోని ఆదివాసీ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆదివాసీ సమాజం తమ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడుకుంటూనే విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ సమాజం యొక్క గొప్ప చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుచేసే ముఖ్యమైన రోజని ఎమ్మెల్యే తెలిపారు. ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణతో పాటు వారి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల పెంపు, తాగునీరు, రహదారులు, తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా ఆదివాసీ యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. బైక్ ర్యాలీ ద్వారా ఆదివాసీ ఐక్యత, ఆత్మగౌరవం, సంస్కృతి పరిరక్షణకు సంబంధించిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. యువత, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు మణుగూరులో ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఆదివాసీ ఐక్యతను చాటుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన..

**నూతన ఉపసర్పంచ్‌ల సంఘం నాయకులు..**

**మణుగూరు.ఆగస్టు 9 (డి డి 9వార్త)**



తెలంగాణ రాష్ట్ర ఉపసర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన గాండ్ల సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపసర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అచ్చా నవీన్ పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్‌ల సంఘం నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, గ్రామ పంచాయతీల బలోపేతానికి మరియు ఉపసర్పంచ్‌ల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాండ్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు అచ్చా నవీన్ మాట్లాడుతూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉపసర్పంచ్‌ల హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం మరియు గ్రామ పంచాయతీల బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, ఆత్మ కమిటీ సభ్యులు ఆవుల సర్వేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసులగడ్డ.. ఆదివాసుల హక్కు..!

- **శ్రీకాకుళం నుండి అదిలాబాద్ వరకు స్వయంపాలన కావాలి.**
- **ఘనంగా ప్రపంచ ఆదివాసుల దినోత్సవం..**

**ఆగస్టు09 డిడి9 వార్త**
**వెంకటాపురం.**



వెంకటాపురం మండల కేంద్రంలోఆదివాసీ సంఘాలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, ఆదివాసీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుల పెద్ద పాయ నాగేశ్వరరావు ఆకుపచ్చ జెండాను ఆవిష్కరించారు.

ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల నివాసాలపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జీవో నం.3ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంత ఆదివాసులకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ ఎమ్మెల్యేలందరూ కలిసి 1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని తీర్మానం చేయాలని కోరారు. 5వ షెడ్యూల్ భూభాగమంతటా పీసా గ్రామసభలను బలోపేతం చేసి, గ్రామసభ తీర్మానాలను రాష్ట్రపతి, గవర్నర్ లకు పంపిస్తామని నాయకులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు 5వ షెడ్యూల్ ప్రాంతాలను సమగ్రంగా కలిపి ఆదివాసులకు ప్రత్యేక స్వయంపాలన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం నేటి నుంచి నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న గిరిజనేతరులను మైదాన ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పూనెం రామచంద్రరావు, పూనెం సాయి, యాసం రాజు, మడకం చిట్టిబాబు, చింత సమ్మయ్య, సిద్ధమైన సర్వేశ్వరరావు, ఉయిక శంకర్, కోర్స నరసింహమూర్తి, గుర్రపు రామారావు, పూనెం మునేశ్వరరావు, జజ్జరి నారాయణమ్మ, వాసం లక్ష్మయ్య, కుర్సంటు చిరంజీవి, కోరం సంతోష్, పసుపులేటి సూర్యనారాయణ తదితరులతో పాటు ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు, మహిళా సంఘాల నాయకులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగిల్ విండో ( రైతు సహకార సొసైటీ ) చైర్మన్ ఆదివాసీ మహిళకే ఇవ్వాలి

**సమ్మక్క పూజారి సిద్దబోయిన లక్ష్మన్ రావు డిమాండ్**

**తాడ్వాయి డిడి9 వార్త**



తాడ్వాయి మండలం ప్రాథమిక రైతు సహకార సొసైటీ చైర్మన్ మొత్తం డైరెక్టర్లు ఆదివాసీ మహిళలకే ఇవ్వాలి అని మేడారం సమ్మక్క పూజారి, ఆదివాసీ జాతీయ నాయకుడు సిద్దబోయిన లక్ష్మన్ రావు డిమాండ్ చేశారు ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన సమ్మక్క సారలమ్మ మేడారం జాతర ఉండే మండలం లో ఆదివాసీ జనాభా 70 శాతం ఉన్నారు అని అందులో మహిళలకు అవకాశం ఇవ్వాలి అని మేడారం ప్రాంతంలో పంటలు ఎక్కువ పండుతున్నాయి అని వ్యవసాయం గురించి తెలియని దొంగలకు పదవులు ఇస్తే పంట రుణాలు ఇవ్వరు అని యూరియా బస్తాలు వేరే రాష్ట్రాలకు అమ్ముకొని మండలం రైతులకు అన్యాయం చేస్తారు అని అప్పుడు ఎన్నికలలో ప్రభావితం చేస్తారు అని అన్నారు.

## గోదావరిఖనిలో ఘనంగా జరిగిన 66వ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.



**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 10:**

గోదావరిఖనిలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు, రామగుండం కార్పొరేషన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కౌటం సతీష్ ఆధ్వర్యంలో ఖని రీగల్ సెంటర్ చౌక్ వద్ద ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి మేయర్ మహంకాళి స్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాదరబోయిన రవి కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కౌటం సతీష్ గారితో కలసి యువజన కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాజీ ప్రధానమంత్రులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకుంటూ, రాహుల్ గాంధీ యువత, ప్రజాస్వామ్యం మరియు సామాజిక న్యాయం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. యువత రాజకీయాల్లోకి వచ్చి దేశ అభివృద్ధికి, సమాజ సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నందున కాంగ్రెస్ పార్టీ యువతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక అని వారు గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ సి,సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, మైనారిటీ సెల్ నాయకులు, ఎన్ ఎస్ యూ ఐ,నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్యకర్తలు మరియు ఇతర కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 50 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం పట్టివేత



**భద్రాచలం , ఆగస్టు 9 (డిడి9 వార్త)**

ఖమ్మం ఎక్సైజు ఎన్ఫోర్సుమెంటు అధికారులు చర్ల మండలం తాలిపేరు పంపు హౌజ్ వద్ద 50 లీటర్ల నాటుసారాతో పాటు ఒక ద్విచక్ర వాహనంను పట్టుకున్నారు. భద్రాచలంలో ఆదివారం ఎన్ఫోర్సుమెంటు సీఐ సీహెచ్ శ్రీనివాస్, ఎస్సై శ్రీహరి రావులు వివరాలు వెల్లడించారు. తాలిపేరు పంపు హౌజ్ వద్ద ముందస్తు సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక ద్విచక్ర వాహనంపై డ్రమ్ములో 50 లీటర్ల నాటుసారాయి లభ్యమైంది. దీంతో పర్సిక సుధాకర్, పొడియం సాంబశివరావు అనే వ్యక్తులను అరెస్టు చేసి భద్రాచలం ఎక్సైజు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులిద్దరు చర్ల మండలం తోగ్గూడెం నుంచి చర్ల మండల కేంద్రంకు సారాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహ్మద్, కానిస్టేబుళ్లు రాజు, వీరబాబు, ప్రసన్నకుమార్, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

# భద్రాచలంలో ఘనంగా రామయ్య నిత్యకల్యాణం



**భద్రాచలం , ఆగస్టు 9 (డిడి9 వార్త)**

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం భద్రాద్రి రామయ్య నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారి మూలవరుల దర్శనంతో పాటు అన్నప్రసాద సౌకర్యం భక్తులకు కల్పించారు.

# నేడు నాగార్జునసాగర్‌లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వరుణయాగం

## భద్రాచలం నుంచి తరలివెళ్లిన రామాలయ వైదిక బృందం




**భద్రాచలం , ఆగస్టు 9 (డిడి9 వార్త)**

రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నేడు నాగార్జున్‌సాగర్ పట్టణంలో వరుణయాగం నిర్వహించనున్నారు. ఈ యాగంలో పాల్గొనేందుకు భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్స్వామి వారి ఆలయంకు చెందిన 11 మంది వైదిక బృందంతో పాటు పరిపాలన సిబ్బంది ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లారు. వీరు రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురవాలని, కరువు కాటకాలు రాకుండా చూడాలని కోరుతూ ప్రభుత్వం తరపున జరిగే వరుణయాగంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**చర్ల, ఆగస్టు 9 (డిడి 9 వార్త )**

చర్ల మండల కేంద్రంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల తుడుం దెబ్బ కార్యాలయం నందు ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ శాసన సభ్యులు పొదెం వీరయ్య నూతనంగా ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొదెం మాట్లాడుతూ కొమరం భీమ్ ఆశయాలను, స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని యువత అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. ఆదివాసీ ఆచార వ్యవహారాలు, సంస్కృతి సాంప్రదాయాలు దేశానికి గొప్ప ఆదర్శనీయమని పేర్కొన్నారు. వీటన్నిటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఆదివాసీపై ఉందన్నారు. సమాజంలో ప్రతి ఆదివాసీ ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పోరాడైన పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామని తెలియజేశారు. అనంతరం చర్ల మండల కేంద్రమైన ఆర్టీసీ బస్టాండ్ నుండి భారీ ర్యాలీగా బయలుదేరి వెంకటాపురం రోడ్డు నుండి మండల తహసీల్దార్ కార్యాలయం మీదుగా అంబేద్కర్ సెంటర్ కు చేరుకొని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు పూలమాలలు వేసి నివాళులు అర్పించి తిరిగి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ భారీ సభకు చర్ల మండలంలోని 26 పంచాయతీల లోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ఆదివాసీలు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రజలు వారి సాంప్రదాయ నృత్యాలతో, డప్పు, డోలు, తుడుం, కొమ్ము, పిప్రి,గజ్జెలు వంటి సాంప్రదాయక వాయిద్యాలతో అత్యంత ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆదివాసీ జేఏసీ నాయకులను, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘాలను, కార్యక్రమ నిర్వాహకులను పొదెం వీరయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ చైర్మన్ వాసం ముసలయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాస రావు, సోయం రాజారావు, తాటి రామకృష్ణ, పూనెం వరప్రసాద్, ఇర్ప రాజు దొర, కారం నరేష్, శ్యామల తరుణ్, ఇర్ప వసంత్, సరెం సమ్మయ్య, సంఘాల నాయకులు, ఆదివాసీ విద్యార్థులు,ఆదివాసీ మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆదివాసుల త్యాగాలే మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పునాది

- భద్రాచలంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు
- ఐటీడీఏ ద్వారా గిరిజన సంక్షేమానికి పెద్దపీట: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పీవో రాహుల్





**భద్రాచలం , ఆగస్టు 9 (డిడి9 వార్త)**

భద్రాచలం ఏజెన్సీలో గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని, ఐటీడీఏ ద్వారా ప్రతి గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలను సజావుగా అందిస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి. రాహుల్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో ఆదివాసి సంఘాలు, ఐటీడీఏ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, గంటల దొర, మల్లుదొర, కొమురం భీం వంటి మన్యం వీరుల అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి, ఆదివాసి గీతాలాపనతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చేపట్టిన భారీ ర్యాలీ గిరిజన భవనం వరకు కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మహాపురుషుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసుల ప్రాణత్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అని కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూనే.. గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉద్దీపకం వర్క్‌బుక్‌లు, కెరీర్ గైడెన్స్, సమ్మర్ కోచింగ్ క్యాంపులు, క్రీడా మైదానాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే, కోయ భాషాభివృద్ధి, గ్రంథాలయాల నిర్మాణం, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెడికల్ కిట్ల పంపిణీ, గిరిజన సంస్కృతి పరిరక్షణకు గిరిజన మ్యూజియం మరియు భద్రగిరి మార్ట్‌ల ఏర్పాటు వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. భద్రాచలం ఐటీడీఏ దేశంలోని అన్ని ఐటీడీఏల కంటే ఉత్తమంగా ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మీడియం బాపూరావు, భద్రాచలం సర్పంచ్ పూణెం కృష్ణ దొర, గిరిజన సంఘాల నాయకులు పాయం రవివర్మ, శరత్ బాబు, మురళి రమేష్, పుల్లయ్య, వీరస్వామి, కుంజా ధర్మ, సుధారాణి, అరుణ, వెంకటరావు వీరభద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాద్రిలో భక్తుల అవస్థలు..

- బురదమయంగా గోదావరి స్నాన ఘట్టాలు
- మెట్లపై భారీగా పేరుకుపోయిన ఇసుక, చెత్తాచెదారం
- ప్రవాహ వేగం, లోతు తెలియక భద్రతా ప్రమాదాల ముప్పు
- దుర్వాసనతో అంటువ్యాధుల భయం.. పట్టించుకోని యంత్రాంతరం





**భద్రాచలం ఆగస్టు 09 ( డిడి9 వార్త )**

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఇక్కడ కొలువుదీరిన శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునే ముందు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడం ఇక్కడి ఆచారం. అయితే, ప్రస్తుతం గోదావరి స్నాన ఘట్టాల వద్ద నెలకొన్న దుస్థితి భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వరద నీరు క్రమంగా వెనక్కి తగ్గినప్పటికీ, నదిలో ప్రవాహ వేగం ఇంకా ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్నాన ఘట్టాల వద్ద అధికారుల పర్యవేక్షణ కొరవడటంపై భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రమాదపు అంచున పుణ్యస్నానాలు..**

వరద ఉధృతి తగ్గిన తర్వాత స్నాన ఘట్టాల మెట్లపై భారీగా ఇసుక, బురద, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మెట్లు అత్యంత జారుడుగా మారి భక్తులు నదిలోకి దిగేటప్పుడు అదుగుజారి కిందపడుతున్నారు. మరోవైపు నదిలో నీటి మట్టం, ప్రవాహ వేగం ఎక్కువగా ఉన్నప్పటికీ.. భక్తులు లోతు ప్రాంతాలకు వెళ్లకుండా ఎలాంటి బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు లేదా గజఈతగాళ్లను ఏర్పాటు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఘట్టాల వద్ద కనీస భద్రతా చర్యలు లేకపోవడంతో ఏదైనా పెను ప్రమాదం జరిగితేనే యంత్రాంతరం కళ్ళు తెరుస్తుందా? అని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కుళ్లిపోతున్న వ్యర్థాలు.. అంటువ్యాధుల ముప్పు**

స్నాన ఘట్టాల మెట్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వరద కొట్టుకొచ్చిన వ్యర్థాలు ఎండకు కుళ్లిపోయి విపరీతమైన దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ దుర్గంధం కారణంగా భక్తులు అక్కడ నిలబడలేని దుస్థితి నెలకొంది. ఈ అపరిశుభ్ర వాతావరణం వల్ల భక్తులకు, ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధులకు వాంతులు, విరేచనాలు, చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలే తీవ్ర ప్రమాదం పొంచి ఉంది.

**తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలి**

పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా అధికార యంత్రాంతరం తక్షణమే స్పందించి స్నాన ఘట్టాల వెంబడి పేరుకుపోయిన బురదను ఇసుకను జెట్ వాటర్ లేదా యంత్రాల సహాయంతో వెంటనే తొలగించాలని భక్తులు అధికారులను కోరుతున్నారు. అలాగే వ్యాధులు ప్రబలకుండా ఘట్టాల పొడవునా పెద్ద ఎత్తున బ్లీచింగ్ పౌడర్ చల్లించి, పరిసరాలను పూర్తిగా శుభ్రం చేయించి భక్తుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. దీంతో పాటు భక్తులు లోతు ప్రాంతాలకు వెళ్లకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు, తగినంత మంది రక్షణ సిబ్బందిని గజఈతగాళ్లను నియమించాలని ప్రభుత్వ అధికారులను కోరారు భక్తుల భద్రతను ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి వసతులు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

# ప్రధాని మోడీ పాలనలో తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం

- జనచైతన్య యాత్రతో మార్పు
- బోనకల్ పర్యటనలో పలు గ్రామాలలో జన చైతన్య యాత్ర
- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్







**బోనకల్,ఆగస్టు 09, (డీడీ9 వార్త):**

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడిందని జన చైతన్య యాత్రలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విమర్శించారు. రైతులు, కార్మికులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోందని ఆరోపించారు.భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ సమితి పిలుపు మేరకు ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర ఆదివారం మండలంలోని మోటమర్రి, రాయన్నపేట, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో దండి సురేష్ మాట్లాడుతూ రైతులపై భారాలు మోపే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు చారిత్రాత్మక పోరాటం చేశారని గుర్తు చేశారు. రైతుల ఉద్యమానికి తలొగ్గి ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వాటి సారాంశాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అలాగే వందేళ్ల సుదీర్ఘ కార్మిక పోరాటాలు, త్యాగాల ఫలితంగా కార్మికవర్గం సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించారని మండిపడ్డారు. కొత్త లేబర్ కోడ్లతో ఉద్యోగ భద్రత, యూనియన్ హక్కులు, కార్మిక సంక్షేమానికి తీవ్ర విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. దేశంలోని పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం( ఎంఎన్ఆర్ఈ జీఎస్) ను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని తీసుకొస్తోందని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలను కుదించే చర్యలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేవారు. రైతులు, కార్మికులు, కూలీలు, పేదల సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చైతన్యం కల్పించడమే జన చైతన్య యాత్ర లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను ఐక్యం చేసి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ముందుగా రాయన్నపేట తూము ప్రకాశరావు భవన్లోని ప్రకాశరావు కాంస్య విగ్రహానికి, కలకోటలోని ప్రకాశరావు స్మారక స్థూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోటమర్రి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో సిపిఎం నాయకులు బంధం శ్రీనివాసరావు తెల్లాకుల శ్రీనివాసరావు లు ప్రజా చైతన్య యాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, సింగు నరసింహరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, ఏనుగు గాంధీ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, బత్తినేని నీరజ, బుర్రి నాగేశ్వరావు, ఏలూరి పూర్ణచంద్రరావు, గుడిద కృష్ణ, ఏనుగు కృష్ణయ్య, రైతు సంఘం నాయకులు పారుపల్లి నరసింహారావు, కొంగర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కారులో పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం.
- తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ.
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.

**డిడి9వార్త / పెద్దపల్లి ఆగష్టు 10:**





పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన రేషన్ షాపును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..అనంతరం ఆషాఢ మాస బోనాల పండుగ మహోత్సవం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా ప్రధాన రోడ్డులో గల శ్రీ కల్యాణమస్తు షాపింగ్ మాల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల మహోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ హయంలో పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగు తుందని నిరుపేదలకు గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు మంజూరు చేయక వారిని మోసం చేశారని కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్లో అర్హులైన పేదలందరికీ నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేసి వారందరికీ సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు సుఖంగా ఉన్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే బోనాల పండుగ మన రాష్టానికే ప్రతీకగా నిలిచి మన సంస్కృతి సాంప్రదాయాలను మరింతగా ఉట్టిపడేలా జరుగుతున్నాయని మన బోనాల పండుగను మరింతగా ప్రోత్సహిస్తూ రాష్ట ప్రభుత్వం ఆర్థిక సహాయ సహకారాలు మరియు గుర్తింపును కలిగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇదిగో బాధితులు... న్యాయం చేయండి

సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య డిమాండ్.

**డిడి9వార్త / రామగుండం ఆగష్టు 10:**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎల్బీనగర్ కాంప్లెక్స్ వివాదం గత కొన్ని రోజులుగా మీరంతా చూస్తూనే ఉన్నారు ఇక్కడ ఆరు దుకాణాలు సక్రమమని మిగతా స్ట్రక్చర్ అంతా అక్రమమని చెప్పి మొన్న మున్సిపల్ సిబ్బంది ధ్వంసం చేసుకోవడం జరిగింది. కానీ ఇప్పుడు అసలు ఇక్కడ అనుమతిలే లేవని చెప్పి సింగరేణి జీఎం నుండి నోటీసులు పిల్లర్లకు అంటించి వెళ్లడం జరిగింది . మీరంతా దుకాణాలు కట్టుకోండి మీకు నేను అనుమతులు లెక్కిస్తాను అని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటివరకు మౌనంగా ఉండడం వెనక ఆంతర్యం ఏమిటని సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య ప్రశ్నించారు. బాధితులందరినీ తీసుకొని వచ్చి బాధితుల వివరాలతో సహా అక్కడ ప్లెక్సీ ఏర్పాటు చేసి అందరితో విలేకరులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్క్కాపూర్ సూర్య మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ లోని ఎల్బీనగర్ షాపింగ్ కాంప్లెక్స్ కుట్రపూరితంగా రాజకీయ కోణంలో నా మీద గెలవలేని కొంతమంది సన్నాసుల మాట విని దీని ధ్వంసం చేయడం జరిగింది. ఈరోజు మీరు ఆరుగురు లబ్ధిదారులు అని చెప్పి చెప్పడం జరిగింది లబ్ధిదారుల వివరాలతో సహా నేనిక్కడ ప్రకటిస్తున్న మీరు వారికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారిని కోరారు. ఉన్నటువంటి బాధితుల్లో ఏ ఒక్కరికి దుకాణం కేటాయించకున్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు కూర్చుంటానని సూర్య హెచ్చరించారు. ఈరోజు ఎమ్మెల్యే మాట విని కట్టుకున్న దుకాణదారులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. ఈరోజు రామగుండం కార్పొరేషన్ లో జరుగుతున్న అవినీతిని దురాక్రమణాలను ఎవరికి తెలియకుండా తిలక్ నగర్ సెంటర్లో జరుగుతున్న కాంప్లెక్స్ నిర్మాణాల పైన ఎమ్మెల్యేకు తెలియకుండా సింగరేణి చేసిన దాడిని కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్ష పార్టీ పైన బురద చల్లడానికి ఈరోజు ఎల్బీనగర్ కాంప్లెక్స్ పైన దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈరోజు తిలక్ నగర్ సెంటర్లో నిర్మాణం జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో 16 షాపులకు 24 షాక్ లు నిర్మాణం జరుగు తున్నాయని ఎనిమిది షాపులు ఎక్కువ కడుతున్నారని అక్కడి స్థానిక కార్పొరేటర్ ఆరోపణలు చేసిన ఎందుకు స్పందించడం లేదని నిజంగా మీకు దమ్ముంటే తిలక్ నగర్ సెంటర్లో నిర్మాణం అవుతున్న షాపింగ్ కాంప్లెక్స్ లో మీ స్థానిక కార్పొరేటర్ కు మీ కార్పొరేషన్ అధ్యక్షునికి ఎటువంటి రూములు లేవని ప్రకటించగలరా, అంతేకాకుండా ఓల్డ్ అశోక్ దగ్గర వేసుకున్న టెంపరరీ స్ట్రక్చర్స్ లో ఎక్స్ట్రా దుకాణాలు లేవని ఏ దుకాణాలకు మా నాయకులు మధ్యవర్తిత్వం వహించలేదని మామిడి చెట్టు కింద ఉన్న లీడర్లు చెప్పగలరా, రాజేష్ థియేటర్ దగ్గర జరిగిన నిర్మాణంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన రెండు గ్రూపులు పరస్పరం ఫిర్యాదు చేసుకుంటే కూర్చొబెట్టి మాట్లాడిన విషయం నిజం కాదా ప్రకటించాలని ఇవన్నీ నిజాలు కాకపోతే నేను ముక్కు భూమికి రాస్తానని ఒకవేళ ఇవన్నీ నిజాలైతే మరి మీలో ఎవరు ముక్కు భూమికి రాస్తారని సూర్య ప్రశ్నించారు. నాకు నిబద్ధత ఉంది కాబట్టే ఇక్కడ జరుగుతున్నటువంటి విషయాలను నిక్కచ్చిగా తెలియజేయడం జరిగింది .ఇదేవిధంగా మీ పార్టీ కూడా మీ నాయకుడు కూడా నిక్కచ్చిగా నిబద్ధతతో ఉన్నట్లయితే ఇదేవిధంగా రామగుండం కార్పొరేషన్లు నిర్మాణం జరుగుతున్న ప్రతి షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర వివరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ఉన్నటువంటి లబ్ధిదారుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా భారత కమ్యూనిస్టు పార్టీగా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు పూసాల శంకర్ సోడాల కనకమ్మ ఎజ్జు రమేష్ ఇమ్రాన్ సారు ఎస్కే గౌస్ కొత్తపల్లి రాయమల్లో సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు శనిగరపు చంద్రశేఖర్ రేణిగుంట్ల ప్రీతం సిపిఐ నాయకులు రాణవేణి సుధీర్ సాధుల శివ పోతరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఊరు ఒక్కటే.. ధరల్లో ఇంత వ్యత్యాసం ఎందుకు.?

- మున్సిపాలిటీ పరిధిలో కేజీ చికెన్ రూ. 280.. 300 సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో రూ 240.
- ధరల వ్యత్యాసంతో సామాన్యుడిపై అదనపు భారం..
- కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలి.
- స్పందించకపోతే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేస్తా..
- సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి.

**మణుగూరు.ఆగస్టు 9(డి డి 9వార్త)**




ఊరు ఒక్కటే అయినప్పటికీ చికెన్ ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంపై మణుగూరు మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త కర్నె రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చికెన్ దుకాణాలలో కేజీ చికెన్ ధర రూ. 280 నుండి రూ 300 వరకు విక్ర యిస్తుండగా, సమితిసింగారం పంచాయతీ పరిధిలో అదే చికెన్ కేజీ రూ. 240కే విక్ర యిస్తున్నట్లు వినియోగదారులు చెబుతు న్నారని ఆయన తెలిపారు. ఒకే ప్రాంతంలో కేజీకి 40 వరకు ధర వ్యత్యాసం ఉండటానికి కారణమేంటని ప్రశ్నించారు. చికెన్ ధరల్లో ఇంతటి వ్యత్యాసానికి కారణాలు ఏమిటో సంబంధిత అధికారులు పరిశీలించాలని కోరారు. కొనుగోలు ధర, రవాణా, నిర్వహణ ఖర్చులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్పటికీ, ధరల్లో ఇంతటి వ్యత్యాసం ఎందుకు వస్తుందో ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చికెన్ ధరల్లో ఇంతటి వ్యత్యాసానికి కొనుగోలు ధరలు, రవాణా ఖర్చులు, నిర్వహణ వ్యయం వంటి అంశాలు కారణమా? లేక వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి తమకు అను కూలంగా ధరలు నిర్ణయిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీ లించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో చికెన్ ధరల్లో కూడా ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తే ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్న సామాన్య, మధ్యతరగతి కుటుంబా లపై అదనపు ఆర్థిక భారం పడుతుందని కర్నె రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కుటుంబం వారానికి ఒకసారి లేదా నెలలో పలుమార్లు చికెన్ కొనుగోలు చేసే పరిస్థితిలో కేజీకి రూ. 40 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తే నెలవారీ కుటుంబ బడ్జెట్పై ప్రభావం పడుతుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని చికెన్ షాపుల్లో ధరల ప్రదర్శన, తూకాల విధానం, వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ధరలు తదితర అంశాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వినియోగదారులకు స్పష్టత ఉండేలా ప్రతి చికెన్ షాపులో ధరలను బహిరంగం గా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై మణుగూరు మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కర్నె రవి డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆశ్రయించి అధికారికంగా ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు. ఊరు ఒక్కటే.. చికెన్ ఒక్కటే.. మరి ధరల్లో ఇంత వ్యత్యాసం ఎందుకు? సామాన్య ప్రజలపై అదనపు భారం పడుతున్న ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కర్నె రవి కోరారు.

# గ్రామపంచాయతీ లో ఘనంగా నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

TFCS అధ్యక్షుడు వంక అర్జునరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహణ.

**మణుగూరు.ఆగస్టు 9 (డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా, మణుగూరు మండలం లోని కూనవరం గ్రామ పంచాయతీ పరిధి లోని కూనవరం గ్రామ బొడ్రాయి సెంటర్ నందు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. టి ఎఫ్ సి ఎస్ అధ్యక్షుడు వంక అర్జునరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా,కూనవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి ఎనిక శ్వేత పతాకావి ష్కరణ చేశారు.అనంతరం కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమించాలని,ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రత్యేక చట్టాలు, జల్,జంగిల్, జమీన్ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన పెంచుకో వాలని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య,వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.అనంతరం గిరిజన కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మరియు ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీ ఉద్యోగస్తులు, గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హక్కుల కోసం పోరాడిన ఆదివాసీలకు ఘన నివాళి



హన్మాజీపేట్‌లో అంగరంగ వైభవంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**బాన్సువాడ, ఆగస్టు 09(డిడి9 వార్త):**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బాన్సువాడ మండలం హన్మాజీపేట్ గ్రామంలో ఆదివాసీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా ఆదివాసీ వీరుడు కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం కామారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొంకి గణేష్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొంకి గణేష్ మాట్లాడుతూ జల్.. జంగల్.. జమీన్ కోసం ఆదివాసీలు సాగించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు.ఆదివాసీల హక్కులు, గుర్తింపు కోసం జరిగిన ఉద్యమాల ఫలితంగా ఐక్యరాజ్యసమితి ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిందన్నారు.ఆది వాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆదివాసీ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య, ఉపాధి, ఆరోగ్యం, మౌలిక వసతుల విషయంలో ఆదివాసీ గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లావణ్య వెంకగౌడ్, ఏర్రవట్టి సాయిబాబా, ఉపసర్పంచ్ బాబ్యా నాయక్, సంజీవ్, వార్డు సభ్యులు కొంకి సుశీల, బాలరాజు, తుకారాం, బాగయ్య, ఆదివాసీ నాయకపోడు గ్రామ అధ్యక్షుడు శంకర్, పెంకటి గణేష్, సుభాష్, గంగాధర్, సాయిలు, కుల పెద్దలు, ఆదివాసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ జరపాలి

- అర్హులైన నిరుద్యోగుల హక్కులను కాలరాయకండి
- బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మండ్లు

**బాన్సువాడ, ఆగస్టు 09(డిడి9 వార్త):**



తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల నియామకాలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ మండల అధ్యక్షుడు చందూరి హన్మండ్లు డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం నుంచి రెగ్యులరైజేషన్ వరకు ప్రతి అంశాన్ని నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్టిఫికెట్ల పునఃపరిశీలనలో భాగంగా 37 మంది లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ అయినట్లు వస్తున్న సమాచారం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఈ ఆరోపణలు విచారణలో నిజమని తేలితే సంబంధిత వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు, నకిలీ సర్టిఫికెట్ల వెనుక ఉన్న మధ్యవర్తులు, దళారులు లేదా అధికారుల పాత్రపై కూడా దర్యాప్తు చేయాలని అన్నారు.రెగ్యులరైజేషన్ ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్, అర్హత, సీనియారిటీ, ప్రభుత్వ నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలు పూర్తిగా పాటించారా లేదా అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని హన్మండ్లు కోరారు. నిర్ణయాలు ఏ నిబంధనల ఆధారంగా తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు.మరో 100 మందికి పైగా లెక్చరర్ల సర్టిఫికెట్లపై స్పష్టత రావాల్సి ఉందనే సమాచారంపైనా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరగకుండా, అనర్హులకు అవకాశం లేకుండా సర్టిఫికెట్ల ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిం చాలని సూచించారు. ఇది కేవలం ఉద్యోగాల అంశం మాత్రమే కాదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విషయమని హన్మండ్లు పేర్కొన్నారు. అర్హత, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులే విద్యార్థులకు బోధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. అర్హత ఉన్న నిరుద్యోగులకు న్యాయం జరగాలి. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం నిజమైతే బాధ్యులందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.నిజాయితీగా ఉన్నవారిని రక్షిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి అని చందూరి హన్మండ్లు డిమాండ్ చేశారు.

# దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులు అర్పించి ఆర్థిక సహాయం అందించిన..

బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్..

**మణుగూరు.ఆగస్టు 9<(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అ శ్వాపుర ం మండలం మల్లెలమడుగు గ్రామంలో మందా రాములు సతీమణి ముత్తమ్మ గారు ఇటీవల మృతి చెందడం జరిగింది. ఆదివారం నాడు వారి దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ హాజరై నివాళులు అర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. 50kg ల రైస్ బ్యాగులను అందించడం జరిగింది. అలాగే కోడి గంగన్న వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు త్రిపుర చంటి, సిపిఎం నాయకులు బొమ్మరాతి రామయ్య, సిపిఐ నాయకులు దంతాల జగదీష్, బోల్లం ఐలయ్య, స్థానిక కిరణ్ షాప్ యజమాని కాశ బోయిన నరేష్, కడారి వేణు, ఇసంపల్లి పున్నారావు, యువజన నాయకులు మంగళగిరి రామకృష్ణ, గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో కుక్కల బీభత్సం

### పసిపిల్లల నుంచి పెద్దల వరకు వరుస దాడులు.. ప్రజల్లో భయాందోళన

**బాన్సువాడ, ఆగస్టు 9(డిడి9 వార్త):**



బాన్సువాడ పట్టణంలో వీధికుక్కల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోంది. పట్టణంలోని వివిధ కాలనీల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పసిపిల్లల నుంచి పెద్దల వరకు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది.తాజాగా ఈరోజు సంగమేశ్వర కాలనీలో వీధికుక్కలు దాడి చేయడంతో సితార (3), ఖాలీద్ బాబు (6)తో పాటు అఫ్రోజ్ (25) గాయపడ్డారు.చిన్నారి సితారకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రతిరోజూ పట్టణంలోని ఏదో ఒక కాలనీలో కుక్కల దాడులు జరుగుతున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖలు వెంటనే స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## మానవత్వంతో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి విద్యార్థులు

**బాన్సువాడ, ఆగస్టు 09(డిడి9 వార్త):**



బీర్కూర్ పట్టణంలోని ప్రైవేట్ స్కూల్‌లో కలిసి చదువుకున్న తోటి మిత్రుడు ఆరె అనిల్ తండ్రి అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న మిత్రులు మానవత్వంతో ముందుకొచ్చారు.తమ వంతు సహాయంగా తోటి మిత్రులందరూ కలిసి రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఆపద సమయంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి తమ స్నేహబంధాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. కష్టకాలంలో తోటి మిత్రుడికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అవారి ప్రవీణ్, బాయిని శ్రీకాంత్, మేర భరత్, గన్నారం కిరణ్, నారం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏనుగంటి నర్సయ్య మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కుమార్ సంతాపం

**భీమ్ గల్ ఆగస్ట్ 09(డీడీ9వార్త):**



బాచన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాచన్‌పల్లి రాజేశ్వర్ తండ్రి ఏనుగంటి నర్సయ్య పరమపదించారు.ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే,మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కుమార్ ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సయ్య మృతి పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నె సురేందర్,బోధిరే స్వామి,జేజే,నరసయ్య,నాగేంద్ర,మురళి తదితరులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

### ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి

**బాన్సువాడ, ఆగస్టు 9(డిడి9 వార్త):**



బాన్సువాడ పట్టణంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కలకలం రేపింది.పట్టణంలోని జామా మసీద్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్ వద్ద ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.మృతుడి ఎత్తు సుమారు 5 అడుగులు ఉండగా, కోల ముఖం, నలుపు రంగు గడ్డం వెంట్రుకలు, చామన ఛాయ రంగు కలిగి ఉన్నట్లు గుర్తించారు.మృతుడు గోధుమ రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.స్థానికుల సమాచారం మేరకు మృతుడు కొంతకాలంగా బాన్సువాడ పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న వ్యక్తిగా తెలుస్తోంది.అయితే అతడి పూర్తి వివరాలు, పేరు, స్వస్థలం, కుటుంబ సభ్యుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.మృతుడిని గుర్తించే వారు లేదా అతడి బంధువులు, ఆచూకీ తెలిసిన వారు వెంటనే బాన్సువాడ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.సమాచారం కోసం సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 87126 86167, 87126 66243.

## ఆదివాసీ దినోత్సవ వేడుకలో ఆదివాసీ ప్రజా ప్రతినిధులకు అవమానం







- **ఫ్లెక్సీ లో ఫోటో,పేరు లేకపోవడం**
- **ప్రోటోకాల్ ఉల్లంఘనపై చర్చ**
- **ఆదివాసీ దినోత్సవ వేదికపై ఎమ్మెల్యే, సర్పంచ్ ఫొటోలు మిస్సింగ్**
- **హాజరుకాని ప్రజాప్రతినిధుల ఫొటోలు కనిపించగా,**
- **స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం లేకపోవడంపై ప్రశ్నలు**
- **ఐటీడీఏ అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీ రూపకల్పనపై చర్చ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి , ఆగస్టు 9 (డిడి9 వార్త )**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలోనీ ప్రధాన వేదిక పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లోని , అలాగే భారీ ర్యాలీ లో ప్రదర్శించిన ఫ్లెక్సీ లో కూడా స్థానిక గిరిజన ఎమ్మెల్యే, స్థానిక గిరిజన సర్పంచ్ ప్రోటోకాల్ అమలుపై చర్చ నెలకొంది. కార్యక్రమానికి ఏర్పాటు చేసిన స్టేజ్ ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర ఫొటోలు లేకపోవడంపై గిరిజన ప్రజలు ప్రజా ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలో కొందరు ప్రజాప్రతినిధుల ఫొటోలు పొందుపరచబడ్డాయి. అయితే స్థానికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, అలాగే భద్రాచలం మున్సిపల్ పరిధిలో సర్పంచ్‌గా ఉన్న ప్రజాప్రతినిధి ఫొటోలు లేకపోవడం చర్చకు దారితీసింది. ముఖ్యంగా కార్యక్రమానికి హాజరుకాని కొందరు ప్రజాప్రతినిధుల ఫొటోలు ఫ్లెక్సీలో ఉండగా, స్థానిక ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకపోవడంపై స్థానికంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వంటి ముఖ్యమైన కార్యక్రమంలోనే స్థానిక ప్రజాప్రతినిధుల ఫొటోలు ఫ్లెక్సీలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇది రూపకల్పనలో జరిగిన పొరపాటా, లేక ప్రోటోకాల్ అంశంపై అవగాహన లోపమా అనే అంశంపై చర్చ జరుగుతోంది. ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ అమలుకు సంబంధించి స్పష్టత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఫ్లెక్సీ రూపకల్పనలో స్థానిక ప్రజాప్రతినిధుల ఫొటోలు ఎందుకు పొందుపరచలేదనే విషయంపై ఐటీడీఏ అధికారులు వివరణ ఇవ్వాలని స్థానిక గిరిజన ప్రజలు కోరుతున్నారు. ఆదివాసీ దినోత్సవం గిరిజనుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ముఖ్యమైన వేడుకగా భావించబడుతున్న నేపథ్యంలో, అధికారిక వేదికపై ప్రోటోకాల్ అమలుపై స్పష్టత అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నిజామాబాద్‌లో మెగా ఉద్యోగ మేళా ఘన విజయము

- **డెబ్బై ఐదు ప్రముఖ సంస్థల పాల్గొనికతో వేలాది ఉద్యోగ అవకాశాలు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరు**

**నిజామాబాద్ ఆగస్ట్ 09 (డీడీ 9వార్త )**





నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి విద్యార్హతలు మరియు నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ రామ గార్డెన్స్‌లో మెగా ఉద్యోగ మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచాన్ని దృష్టిలో ఉంచుకుని కేవలం విద్యార్హతలతో మాత్రమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలు, సమాచార వినిమయ నైపుణ్యాలు, వృత్తి పరిజ్ఞానం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్న ఈ కాలంలో యువత తమకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే జీవితంలో ఎదుగుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ మెగా ఉద్యోగ మేళాలో వివిధ రంగాలకు చెందిన డెబ్బై ఐదు ప్రముఖ సంస్థలు పాల్గొని తమ సంస్థల్లో ఉన్న ఖాళీల గురించి వివరాలు వెల్లడించాయి. ఉద్యోగాలకు అవసరమైన అర్హతలు, పని విధానం, వేతనాలు, భవిష్యత్ అవకాశాలపై సంస్థల ప్రతినిధులు ఉద్యోగార్థులకు అవగాహన కల్పించారు. ఉద్యోగాల కోసం వచ్చిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవాన్ని పరిశీలించారు. అర్హత కలిగిన అభ్యర్థులకు పలు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక ప్రక్రియను కొనసాగించారు. ఈ మెగా ఉద్యోగ మేళాకు యువత నుంచి విశేష స్పందన లభించింది. భారీ సంఖ్యలో ఉద్యోగార్థులు హాజరై వివిధ సంస్థల ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హత పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగార్థులు మరియు యువత పాల్గొన్నారు.

## ప్రతిభకు బంగారు బాట విద్యార్థులకు ట్రస్ట్ నుంచి భారీ చేయూత







**నిజామాబాద్ ఆగస్ట్ 09 (డీడీ 9 వార్త)**

విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎమ్ ఎస్ అర్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని అమ్మావెంచర్‌లో గల ఎస్ అర్ కె ఫంక్షన్ హాల్‌లో ఘనంగా స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 130 మంది విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.13 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి తమ చదువును కొనసాగించేందుకు ఈ స్కాలర్‌షిప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే వరకు నిరంతరం కష్టపడాలని సూచించారు. ఎమ్ ఎస్ ఆర్ చారిటేబుల్ ట్రస్ట్ ప్రతినిధులు విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే ఆశయంతో స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మరింత కష్టపడి చదివేందుకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు క్రమశిక్షణ పట్టుదల సమయపాలన మంచి వ్యక్తిత్వం నైతిక విలువలు ఎంతో అవసరమని సూచించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులపై మొబైల్ ఫోన్ల ప్రభావం ఎక్కువగా ఉందని పేర్కొంటూ మొబైల్ ఫోన్‌కు బానిస కావద్దని సూచించారు. మొబైల్ ఫోన్‌ను అవసరమైన సమాచారం విద్యాభ్యాసం కోసం మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని సమయాన్ని వృథా చేసే విధంగా సోషల్ మీడియా తదితరాలకు అలవాటు పడకూడదని హితవు పలికారు. చదువుతో పాటు విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని నడవడికను క్రమశిక్షణను అలవర్చుకోవాలని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో తమ కుటుంబానికి సమాజానికి దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం అందుకుంటున్న ఈ స్కాలర్‌షిప్‌ను కేవలం ఆర్థిక సహాయంగా కాకుండా తమపై ఉంచిన నమ్మకంగా భావించి మరింత పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఎమ్ ఎస్ ఆర్ చారిటేబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నవీపేట వాస్తవ్యులు శివారెడ్డి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి చదువుకు కొంతమేర అండగా నిలవాలనే ఉద్దేశంతో స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని చెప్పారు. ఈ స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో మంచి స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం విద్యార్థులు తాము అందుకుంటున్న సహాయాన్ని భవిష్యత్తులో గుర్తుంచుకుని తాము ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత తమలాంటి అవసరం ఉన్న ఇతర విద్యార్థులకు కూడా సహాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి వెళ్లినా తమను చదివించిన తల్లిదండ్రులను విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరిచిపోకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఫౌండర్ శిరీష టౌన్ 4 ఎస్ ఐ పి సాయన్న ట్రస్ట్ సభ్యులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాంస్కృతిక వైభవానికి బోనాలు ప్రతీక







## ఖిల్లా మైసమ్మ, మహంకాళి అమ్మవార్లకు పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 9(డిడి9 వార్త):**

ఆషాఢమాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.అనంతరం జియాగూడ సబ్జీ మండి మహంకాళి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు మహంకాళి అమ్మవారి బోనాల వేడుకల్లో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో గజరాజు గజమాలతో పోచారం శ్రీనివాస రెడ్డిని ఘనంగా సత్కరించి ఆశీర్వదిస్తూ స్వాగతం పలికింది. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ, రాష్ట్ర సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించేందుకు కట్టుబడి ఉందని అన్నారు.అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా తీజ్ పండుగ

- పోచారం తండా, రాంపూర్ తండాల్లో ఘనంగా తీజ్ వేడుకలు
- బంజారా సోదరీమణులతో కలిసి నృత్యం చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి





**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 9(డిడి9 వార్త):**

బాన్సువాడ మండల పరిధిలోని పోచారం తండా, రాంపూర్ తండాలలో తీజ్ పండుగ వేడుకలను బంజారా సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బంజారా సోదర సోదరీమణులతో కలిసి తీజ్ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ బంజారా సమాజానికి తీజ్ పండుగ ఎంతో ప్రత్యేకమైనదని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను కాపాడుకుంటూ పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు. బంజారా సోదర సోదరీమణులందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, సంతోషం, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు.

### సంప్రదాయ పద్ధతిలో తీజ్ వేడుకలు

తీజ్ పండుగలో భాగంగా బంజారా మహిళలు సంప్రదాయ పద్ధతిలో గోదుమ విత్తనాలను బుట్టల్లో పెంచి వాటిని ప్రత్యేకంగా అలంకరించారు. పండుగ రోజున ఆ తీజ్ బుట్టలను తలపై ఎత్తుకుని సంప్రదాయ పద్ధతిలో వేడుకలు నిర్వహించారు. తండాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ పండుగకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. పోచారం శ్రీనివాస రెడ్డి సైతం తీజ్ బుట్టలను ఎత్తుకుని బంజారా సోదరీమణులతో కలిసి ఉత్సాహంగా నృత్యం చేయడంతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది.ఎమ్మెల్యేను తమతో కలిసి పండుగలో పాల్గొనడం పట్ల బంజారా మహిళలు, యువత హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీజ్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

### బంజారా సంస్కృతికి అద్దం పట్టిన వేడుకలు

తీజ్ పండుగ కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా బంజారా సమాజం యొక్క జీవన విధానం, సంప్రదాయాలు, ఆచారాలు, ఐక్యతను ప్రతిబింబించే ముఖ్యమైన సాంస్కృతిక వేడుకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. తండాల్లో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలను నేటి తరం కూడా కొనసాగిస్తూ పండుగలను నిర్వహించడం ద్వారా బంజారా సంస్కృతి, వారసత్వం భవిష్యత్ తరాలకు అందుతుందని తెలిపారు.తీజ్ పండుగ సందర్భంగా తండాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేకంగా అలంకరించుకుని వేడుకల్లో పాల్గొనగా, యువత సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ పండుగ వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

### ఆనందోత్సాహాల్లో భాగస్వామైన పోచారం

పోచారం తండా, రాంపూర్ తండాలలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి పాల్గొనడంతో బంజారా ప్రజల్లో మరింత ఉత్సాహం నెలకొంది. బంజారా సోదర సోదరీమణులతో ఆత్మీయంగా మమేకమైన ఆయన, వారి సంప్రదాయాలను గౌరవిస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి నృత్యం చేస్తూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లా డుతూ బంజారా సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రత్యేక పండుగలను నిర్వహించడం అభినందనీయమన్నారు.తీజ్ పండుగ సందర్భంగా తండాల్లో నెలకొన్న సందడి, సంప్రదాయ నృత్యాలు, పాటలు, మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, బంజారా పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు.తండాల్లో ఉదయం నుంచి పండుగ వాతావరణం నెలకొనగా, సాయంత్రం వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి కొనసాగింది.

# ఆచన్‌పల్లిలో వైభవంగా ఆషాఢ బోనాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 ఆగస్టు(డీడీ9 వార్త):**





తెలంగాణ సంస్కృతీసంప్రదాయాల దివ్య ప్రతీక అయిన బోనాల ఉత్సవాలు బోధన్ పట్టణంలోని 1వ వార్డు ఆచన్‌పల్లిలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మికతతో జరిగాయి. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. నెత్తిపై బోనం ఎత్తుకొని ఊరేగింపులో నడుస్తూ, కాలనీ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... బంగారు తెలంగాణలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రాన్ని, పట్టణాన్ని చల్లగా చూడాలని జనం తరఫున దేవీమాతను ప్రార్థించినట్లు చెప్పారు. మంగళవాయిద్యాల శబ్దాలు, దేవీ నామస్మరణలతో ఆచన్‌పల్లి పరిసరాలు ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లాయి. సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయిన నారీమణులు, బాలబాలికలు వేపకొమ్మలు, పసుపుకుంకుమలతో అలంకరించిన బోనాలతో కదలివచ్చారు. మొదట బంగారు మైసమ్మ ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అక్కడి నుంచి పోచమ్మ తల్లి దేవాలయం వరకు సాగిన శోభాయాత్ర అలరించింది. చివరకు పోచమ్మ అమ్మవారికి బోనాలు నివేదించి సమస్త ప్రజల క్షేమాన్ని కాంక్షించారు. ఈ బోనాల మహోత్సవంలో కాలనీవాసులు, భక్తజనం, ప్రజాప్రతినిధులు పాల్గొని ఉత్సవాన్ని జయప్రదం చేశారు.

# షెడ్ ధ్వంసంపై బోధన్ రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 ఆగస్టు(డీడీ9 వార్త):**

తమ స్థలంలో వేసుకున్న రేకుల షెడ్‌ను ధ్వంసం చేయడంతో పాటు తమపై దాడికి పాల్పడ్డారంటూ సాలుర గ్రామానికి చెందిన లోలేవర్ ఆనంద్ బోధన్ రూరల్ పోలీసులను ఆశ్రయించారు. సర్వే నంబర్ 1962లోని స్థలాన్ని కొనుగోలు చేసి, అనుమతులతో నిర్మాణం చేపడుతుండగా ఈ ఘటన జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నెల 8న సర్పంచ్ భర్త సోక్కం రవి, ఉప సర్పంచ్ సురేష్ పటేల్, డిస్కో సాయిలుతో పాటు పలువురు వార్డు సభ్యులు వచ్చి షెడ్‌ను పగలగొట్టారని తెలిపారు. డబ్బులు డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతోనే దాడి చేసి సుమారు రూ.50 వేల నష్టం కలిగించారని ఆరోపించారు. తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులను వేడుకున్నారు.

# లింబాద్రిగుట్టపై ఆధ్యాత్మిక వైభవం:

## భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



**భీమ్‌గల్, ఆగస్టు 9 (డీడీ 9 వార్త):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో యోగ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా సాగిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచే యోగ సభ్యులు, భక్తులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి నామస్మరణలు, భక్తిగీతాల మధ్య ప్రకృతి ఒడిలో సాగిన ఈ నడక భక్తులలో సరికొత్త ఉత్సాహాన్ని, మానసిక ప్రశాంతతను నింపింది. నిత్య జీవితంలో యోగ, వ్యాయామాలకు కొంత సమయం కేటాయించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని నిర్వాహకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గిరిప్రదక్షిణ అనంతరం శారీరక దృఢత్వం, ఏకాగ్రత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి పెంపొందేలా యోగ సభ్యులు, యువత కలిసి ఉత్సాహంగా కబడ్డీ ఆట ఆడారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం ఏదో ఒక శారీరక శ్రమ లేదా క్రీడల్లో పాల్గొనాలని సూచిస్తూ, అనంతరం పాల్గొన్న వారందరికీ శరీరానికి మేలు చేసే, శక్తినిచ్చే సహజ సిద్ధమైన సాత్విక ఆహారాన్ని పంపిణీ చేశారు. యోగ, క్రీడలు, సాత్విక ఆహారం వంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో ఆరోగ్యంపై అవగాహన, ఐక్యత పెరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యోగ ప్రతినిధులు, భక్తులు, స్థానిక యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిరుద్యోగ యువతకు అండగా ఎమ్మెల్యే ధనపాల్ ముందడుగు: ఘనంగా ఉద్యోగ పత్రాల పంపిణీ

## ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ధన్‌పాల్ సూర్యనారాయణ




**నిజామాబాద్, ఆగస్టు 09 (డీడీ 9 వార్త):**

నిజామాబాద్ నగర నిరుద్యోగ యువతీ యువకులకు అండగా నిలుస్తూ, అర్బన్ శాసనసభ్యులు శ్రీ ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ మెగా జాబ్ మేళా అత్యంత విజయవంతమైంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు పాల్గొన్న ఈ మేళాలో ప్రతిభ కనబరిచి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే తన చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ, స్థానిక యువతకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా ఈ ముందడుగు వేసినట్లు స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్యను దూరం చేసేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలను చేపడతామని భరోసా ఇచ్చారు. కష్టపడి ఉద్యోగాలు సాధించి, కుటుంబాలకు ఆసరాగా నిలిచిన ప్రతి అభ్యర్థికి ఆయన తన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, కొత్త ఉద్యోగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువత మరియు అభ్యర్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని మేళాను విజయవంతం చేశారు.

# సిరికొండ మండల కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

## కార్యక్రమంలో పాల్గొన్న ఆదిలాబాద్ డిసిసి వైస్ ప్రెసిడెంట్ బగునూరే. మాధవ్ రావు పటేల్.



**సిరికొండ 09 ఆగస్టు: ( డి డి 9 వార్త న్యూస్):**

ఆదివారం రోజు సిరికొండ మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవము ఘనంగా నిర్వహించడం జరిగినది. ఆదివాసి నాయకులు సిరికొండలో ర్యాలీ నిర్వహించి మండల కేంద్రంలోని గాంధీ చౌక్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ చిత్రపటాలకు ఆదివాసీ నాయకులు పూలమాల వేసి జెండాను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ భగునూరే. మాధవరావు పటేల్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఆదివాసీలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిందన్నారు.ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు, అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆదివాసీ సమాజం అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత కల్పిస్తుందని, విద్య, ఉపాధి, ఆరోగ్యం, మౌలిక వసతుల విషయంలో ఆదివాసీ గ్రామాలకు మెరుగైన సౌకర్యాలు ప్రజా ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన అన్నారు .ఈ సందర్భంలో ఆదివాసి నాయకులతోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తు, ఉప సర్పంచ్ రాజు, మండల అధ్యక్షులు కంచం.లక్ష్మణ్, మాజీ అధ్యక్షులు షేక్. ఇమామ్, మాజీ జెడ్పిటిసి రఘురాం, రిమ్మ మాజీ సర్పంచ్ పేందూర్. అనిల్ కుమార్,డిసిసి జనరల్ సెక్రెటరీ షేక్. ఇమామ్, బొడ్డు.నవీన్, బారిక్ రావు, ఆదివాసి మహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518